క్లుప్తంగా

తొలగిన ఎన్నికల ముసుగు



సి.బెళగల్‌లో వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించిన దృశ్యం

సి.బెళగల్: ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసిన విషయం తెలిసిందే. అయితే కోడ్ తొలిగినా నాయకుల విగ్రహాలకు ముసుగు తొలగించకపోవడంతో సాక్షి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. సోమవారం స్థానిక ప్రధాన రోడ్డు పక్కనున్న వైఎస్సార్ విగ్రహానికి ముసుగు తొలగించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



పూజలో పాల్గొన్న కురువ సంఘం నాయకులు

కల్లూరు: పెద్దపాడు ఏపీ మోడల్ పాఠశాల పక్కన జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న శ్రీ బీరలింగేశ్వర స్వామి దేవాలయ గర్భగుడి నిర్మాణానికి భూమి పూజ చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సంఘం నాయకులు బి.వెంకటేశ్వర్లు, రామలక్ష్మమ్మ, టి.లీలమ్మ, పాలసుంకన్న, రంగస్వామి, హరిదాసు పాల్గొన్నారు.

తగ్గిన పంచాయతీ ఆదాయం

పాణ్యం: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోనున్న బండ్లమెట్ట, మార్కెట్, జంతు వధశాలకు నిర్వహించిన వేలంలో పంచాయతీకి ఆదాయం తగ్గింది. సోమవారం డీఎల్‌పీఓ రాంబాబు, సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ ఆధ్వర్యంలో బహిరంగ వేలాలు నిర్వహించారు. బండ్లమెట్ట, మార్కెట్‌కు రూ.4,35,000లకు ముస్తఫా దక్కించుకున్నారు. జంతువధశాలను రాజన్న రూ.7,100కు పాడారు. గతేడాది బండ్లమెట్ట, మార్కెట్ రూ.6,25,000 పలికింది. అలాగే జంతువధశాల రూ.8100లకు పోయింది. వేలాలను డీఎల్‌పీఓ పర్యవేక్షించారు.

29న 'గడప గడపకు మన ప్రభుత్వం'

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 29 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు మండలంలోని పంచలింగాల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్.భాస్కర్‌నాయుడు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ పాల్గొని గ్రామంలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అందజేస్తున్న పథకాల గురించి ప్రజలకు వివరించి సమస్యలను తెలుసుకుంటారని పేర్కొన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు విధిగా హాజరు కావాలని కోరారు.

గ్రామాల శుభ్రతే లక్ష్యం

పాణ్యం: గ్రామాలను శుభ్రంగా ఉంచాలనేదే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక పంచాయతీ సర్పంచ్ మేకల పల్లవి, ఈఓ అనురాధ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వర్మీ యూనిట్‌లో నంద్యాల, గోస్పాడు, చాగలమర్రి,శిరువెళ్ల, సంజామల, గడివేముల, ఆళ్లగడ్డ, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ మండలాల సచివాయల సిబ్బంది, క్లాప్ సిబ్బందికి సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు పరిసరాల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వం 'జగనన్న స్వచ్ఛ సంకల్పం' పేరుతో ఇదివరకే శిక్షణ తరగతులు నిర్వహించిందని చెప్పారు. పిన్నాపురం గ్రామ కార్యదర్శి నాగేంద్రనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

కల్లూరు: వేసవి కాలంలో ప్రజలు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు కర్నూలు నగరంలోని సీ.క్యాంపు సెంటర్‌లో రక్షణ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు సుంకన్న, ఉపాధ్యక్షుడు వెంకటేష్, కార్పొరేటర్ డి.లక్ష్మీకాంతారెడ్డి పాల్గొన్నారు.

31న సామాజిక తనిఖీ బహిరంగ సభ

కల్లూరు: మండలంలో వివిధ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద 2021- 2022 మార్చి వరకు జరిగిన పనులపై సామాజిక తనిఖీపై బహిరంగ ప్రజావేదికను ఈనెల 31వ తేదీన కల్లూరు మండల పరిషత్ కార్యలయ ఆవరణలో ఏర్పాటు చేస్తామని ఏపీఓ మద్దేశ్వరమ్మ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.

భక్తుల ఆరాధ్య దైవం బడేషాఖాద్రి

- నేటి నుంచి బడేషాఖాద్రి ఉరుసు
- తుంగభద్ర నదితీరంలో నెలకొన్న సందడి
- మూడు రోజులపాటు కొనసాగనున్న ఉత్సవాలు
- భారీగా తరలిరానున్న భక్తులు



గుండ్రేవుల గ్రామంలో బడేషాఖాద్రి దర్గా

సి.బెళగల్: భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్నారు గుండ్రెవులలోని శ్రీ హజతర్ సయ్యద్ షా జలాలుద్దీన్ ఖాద్రి (బడేషా ఖాద్రి). ఏటా ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ఉత్సవాలు నిర్వహిస్తామని నిర్వాహకులు సయ్యద్ బడేసాహే ఖాద్రీ, సయ్యద్ బాబు తెలిపారు. గ్రామంలోని తుంగభద్ర నదితీరంలో వెలసిన బడేషా ఖాద్రి స్వాముల వారి 384వ ఉరుసు ఉత్సవాలను మూడు రోజుల పాటు నిర్వహిస్తామని దర్గా పీఠాధిపతి సయ్యద్ రసూల్ ఖాద్రి తెలిపారు. ఉత్సవాలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లా, మహబూబనగర్ జిల్లాల నుంచి భక్తులు భారీగా తరలిరానున్నారు. ఏటా ఉత్సవాలతో మూడు రోజుల పాటు తుంగభద్రా నదీ తీరం కిక్కిరిసిపోతుంది. ఇందులో భాగంగా సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వ్యాపారులు ఆట వస్తువులు, తినుబండారాల అంగళ్లను ఏర్పాటు చేశారు. దీంతో పరిసరాలు కొనుగోలుదారులతో సందడిగా మారా యి. దర్గాతో పాటు గ్రామంలోని దస్తగిరయ్య, పెద్దయ్య దర్గాలను సుందరంగా అలంకరించారు.

ఇనగండ్లలో..

ఇనగండ్ల గ్రామంలో శ్రీ హజతర్ సయ్యద్ షా జలాలుద్దీన్ ఖాద్రి అల్ మారుఫ్ సయ్యద్ షా బడేషా ఖాద్రి ఉరుసు మంగళవారం మొదలవుతుందని గ్రామ పెద్దలు సోమవారం తెలిపారు. మంగళవారం గంధం, బుధవారం వేకువజామున గంధంను దర్గాకు చేర్చిన అనంతరం ఉరుసు నిర్వహిస్తామని చెప్పారు. గురువారం జియారత్ ఫాతెహా (కిస్తీ) కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

విజయదీపిక పుస్తకాలు మంజూరు



పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతూ డి గ్రేడు మార్కులు వచ్చిన విద్యార్థుల కోసం 526 విజయదీపిక స్టడీ మెటీరీయల్ పుస్తకాలు మంజూరయ్యాయని ఎంఈఓ అనంతయ్య సోమవారం తెలిపారు. వెనుకబడిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విజయదీపిక పుస్తకాలను అందజేసిందని వాటిని విద్యార్థులకు పంపిణీ చేసేందుకు గాను ఆయా హైస్కూళ్ల హెచ్‌ఎంలకు అందజేసినట్లు చెప్పారు.

కొర్రలో పంటకోత ప్రయోగం



పోలకల్ వద్ద ప్రయోగం చేపట్టిన అధికారులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్, మండల గణాంకాధికారి (ఏఎస్‌ఓ) ఆదినారాయణ సిబ్బందితో కలిసి పంటకోత ప్రయోగం చేపట్టారు. సోమవారం గ్రామంలోని రైతు భరత్ కుమార్ పొలంలోని కొర్ర పంటలో ప్రయోగం చేయగా దిగుబడి 8.8 కేజీలుగా వచ్చిందని, ఈ మేరకు ఎకరాకు దాదాపు ఎనిమిది క్వింటాళ్ల దిగుబడి రావచ్చని అంచనా వేశారు. అలాగే రైతు రాముడు పొలంలో ప్రయోగం చేయగా 9.9 కేజీలు రాగా, ఎకరాకు దాదాపు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశముందని, ఇది సాధారణం కన్న కాస్త మెరుగైన దిగుబడి అని చెప్పారు. వ్యవసాయ సిబ్బంది వెంకటేష్, వీఆర్‌ఏలు, రైతులు ఉన్నారు.

డిజిటల్ రికార్డులు సిద్ధం చేస్తాం



ఉల్చాలలో భూములు రీ సర్వే చేస్తున్న దృశ్యం

కర్నూలు (న్యూటౌన్): మండలంలోని అన్ని గ్రామాల్లో జరుగుతున్న భూ సర్వే పూర్తయ్యాక ఆధునిక డిజిటల్ రికార్డులు సిద్ధం చేస్తామని కర్నూలు రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రాలను అందజేస్తామన్నారు. సోమవారం నాటికి మండలంలోని 21 రెవెన్యూ గ్రామాల్లో 81,261.86 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని, మొత్తం మీద 82,632 ఎకరాల భూమి ఉందని, త్వరలోనే మిగిలిన భూముల రీ సర్వే పూర్తి చేస్తామని చెప్పారు. వీఆర్‌ఓలు, గ్రామ సర్వే సహాయకులు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రమాణాలు పెంచాలి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

పాణ్యం: గిరిజన విద్యార్థుల్లో నైపుణ్య ప్రమాణాలు పెంచాలని ఐటీడీఏ పీఓ రవీంద్రారెడ్డి సూచించారు. సోమవారం నెరవాడ మెట్ట వద్దనున్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీఓ మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో సాంకేతిక విద్యా ప్రమాణాలు పెంచాలని చెప్పారు. పాఠశాలలో పరిసరాల శుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వంటగది, స్టోర్ రూమ్, కూరగాయల గది, భోజనం చేసే హాల్ తదితర వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అంతకుముందు గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాలో జరిగే ఇంటర్ పరీక్షలను పర్యవేక్షించారు.

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు



మహిళా అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న ఎంపీడీఓ రాముడు, సూపరింటెండెంట్ పుల్లయ్య

సి.బెళగల్: మండల పరిధిలోని గ్రామాల్లో ఖాళీగా ఉన్న నాలుగు గ్రామాల వలంటీర్ పోస్టుల భర్తీకి సంబంధించి అధికారులు సోమవారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు సూపరింటెండెంట్ పుల్లయ్యతో కలిసి ఇంటర్వ్యూలు చేపట్టారు. మండలంలోని సి.బెళగల్, గొల్లలదొడ్డి, మారందొడ్డి, కంబదహాల్ గ్రామాల్లో ఖాళీగా ఉన్న ఆరు వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించగా 21 మంది దరఖాస్తు చేసుకున్నారని, వారిని సోమవారం ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. ఇందుకు 15 మంది అభ్యర్థులు హాజరయ్యారని, అర్హులైన వారికి త్వరలోనే సమాచారమిస్తామని అధికారులు తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలో ఖాళీగా ఉన్న 6 వలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు సోమవారం మండల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలోని లద్దగిరి గ్రామ సచివాలయాల పరిధిలో 3, వర్కూరు 1, కోడుమూరు 1, ముడుమలగుర్తి గ్రామ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న ఒక వలంటీర్ పోస్టులకు 9మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగా, సోమవారం జరిగిన ఇంటర్వ్యూలకు ఏడుగురు అభ్యర్థులు హాజరయ్యారని, ఎంపికైన వారి వివరాలను మంగళవారం ప్రకటిస్తామని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.ఈఓఆర్డీ మంజుల, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, సూపరింటెండెంట్ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

గడివేముల: సచివాలయాలలో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతుల నుంచి వచ్చిన వినతులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సచివాలయాల్లో ఉండి గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని చెప్పారు. ఎండలు అధికంగా ఉండటంతో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు జాగ్రత్తలను వివరించాలన్నారు.

నేడు వైఎస్సార్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు

పాణ్యం: స్థానిక వైఎస్సార్ విగ్రమం వద్ద వైఎస్సార్‌టీయూసీ జెండాను మంగళవారం ఆవిష్కరిస్తామని యూనియన్ జిల్లా అధ్యక్షుడు చాంద్‌బాషా సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహిస్తామని ఈ సందర్భంగా కార్మికుల కోసం ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల గురించి వివరిస్తామని చెప్పారు. నాయకులు, కార్మికులు పాల్గొనాలని కోరారు.

29,30న ఓపెన్ కబడ్డీ పోటీలు

కర్నూలు (న్యూటౌన్): శ్రీరామ నవమి సందర్భంగా స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29,30వ తేదీల్లో మండలంలోని గొందిపర్ల గ్రామంలో ఓపెన్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ సభ్యురాలు కె.కృష్ణవేణి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీలను రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేష్, శ్రీసాయి పేపర్ మిల్ సీఎండీ బీవీ సత్యసాయి ప్రసాద్, కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. విజేతలకు వరుసగా.. రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు, రూ.6వేలు, రూ.4వేలు అందజేస్తామని వివరించారు. వివరాలకు సెల్ 9989642989 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

సుంకేసులకు 1,550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి సోమవారం 1,550 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని డ్యాం అధికారులు తెలిపారు. డ్యాంలో 1.026 టీఎంసీల నీటి నిల్వ ఉండగా, కేసీ కాల్వకు 1,540 క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నామని చెప్పారు.

30 నుంచి గుడిపాడులో ఉత్సవాలు

గూడూరు రూరల్: మండలంలోని గుడిపాడు గ్రామంలో అప్పాలురెడ్డి తాత ఉత్సవాలను ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 30న నందికోల సేవ, 31న ప్రభోత్సవం, ఏప్రిల్ 1న రథోత్సవం కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

జెడ్పీ అతిథిగృహం ప్రారంభం

కర్నూలు(అర్బన్) : జిల్లాపరిషత్ ప్రాంగణంలో అన్ని వసతులతో ఏర్పాటు చేసిన నూతన అతిథి గృహాన్ని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రారంభించారు. జెడ్పీటీసీ, మండల పరిషత్ అధ్యక్షులకు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా అతిథిగృహాన్ని ఏర్పాటు చేసేందుకు చైర్మన్ ప్రయత్నిస్తూ వచ్చారు. ఈ నేపథ్యంలో ప్రాంగణంలో డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయ భవనానికి కేటాయించిన భవనాన్ని తిరిగి జిల్లాపరిషత్ స్వాధీనం చేసుకుని ఆ భవనంలో రూ.12.50 లక్షలు వెచ్చించి అతిథిగృహంగా రూపుదిద్దారు. డీఎల్‌పీఓ కార్యాలయాన్ని డీపీఆర్‌సీ భవనంలోకి మార్చారు.

మహిళల పక్షపాతి సీఎం జగన్



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి



సమావేశానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- పొదుపు మహిళలకు ఆసరా చెక్కు పంపిణీ

కల్లూరు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మహిళల పక్షపాతి అని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఆసరా వారోత్సవాల కార్యక్రమాన్ని ఎంపీడీఓ జివి రమణమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. వివిధ గ్రామాలకు ప్రాంతాలకు చెందిన పొదుపు సంఘాల మహిళలకు ప్రభుత్వం అందించిన వైఎస్సార్ ఆసరా పథకం మెగా చెక్కును పంపిణీ చేశారు. ఎమ్మెల్యే, డీఆర్‌డీఏ పీడీ వెంకటసుబ్బయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుపై అందిస్తోందని చెప్పారు. 2014 ఎన్నికల్లో పొదుపు సంఘాల రుణాలను మాఫీ చేస్తానని టీడీపీ హామీ ఇచ్చిందని, అధికారంలోకి రాగానే మాఫీ హామీని చంద్రబాబు పట్టించుకోలేదన్నారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో అక్కచెల్లెమ్మల బాధలను కళ్లారా చూసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి 2019 ఏప్రిల్ 11 నాటికి ఉన్న పొదుపు సంఘాల బ్యాంక్ లింకేజ్ రుణాలను మాఫీ చేస్తానని నాడు హామీ ఇచ్చి వారి నేడు నాలుగు విడతలుగా నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. ఇందులో ఎవరిది విశ్వసనీయతో మీరే తెలుసుకోవాలన్నారు. 2019 నాటికి మండలంలో పొదుపు సంఘాల మహిళలు రూ. 19.76 కోట్లు బ్యాంకుల్లో అప్పు ఉండేదన్నారు. ఇప్పటికే రెండుసార్లు ఆసరా పథకం కింద రుణాలు మాఫీ చేయగా, ప్రస్తుతం మూడవ విడత కింద మండలంలో 8,621 పొదుపు సంఘాల మహిళలకు రూ. 4.94 కోట్లు రుణ మాఫీ చేశామన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేసి మహిళలకు చెక్కు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ ఆల ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్ నారాయణరెడ్డి, కల్లూరు సింగిల్ విండో చైర్మన్ శివ శంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఏపీఎం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కేశవరెడ్డి, పెద్ద ఈశ్వరయ్య, సోమన్న యాదవ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై సమాచారమివ్వండి

కోడుమూరు రూరల్: మండలంలోని గ్రామాల్లో ఎవరైనా నకిలీ పత్తి విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే సమాచారమిస్తే చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ తెలిపారు. సోమవారం మండలంలోని ఎర్రదొడ్డి రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. నకిలీ విత్తనాలు, నకిలీ మందులు కొని మోసపోవద్దని చెప్పారు. మండుతున్న ఎండల దృష్ట్యా రైతులెవ్వరూ వేసవిలో బోరుబావుల కింద పత్తి పంట సాగు చేయరాదని కోరారు. ఆర్‌బీకే సిబ్బంది కేంద్రాల్లో అందుబాటులో ఉండి రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు.

నేడు 'ఆసరా' చెక్కుల పంపిణీ

ఓర్వకల్లు: పొదుపు మహిళలకు ప్రభుత్వం మంజూరు చేసిన మూడో విడత వైఎస్సార్ ఆసరా పథకం చెక్కులను మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వెంకటరామిరెడ్డి సోమవారం తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని చెప్పారు. ముందుగా ఉదయం 8 గంటలకు కాల్వబుగ్గ గురుకుల పాఠశాల ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన హాస్టల్ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి అక్కడి నుంచి ఓర్వకల్లు పొదుపు భవనం వద్ద ఉదయం 11 గంటలకు ఏర్పాటు చేసిన పొదుపు మహిళల బహిరంగ సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గడివేముల: స్థానిక కస్తూర్బా బాలికల విద్యాలయంలో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రుబీనా సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి ఏప్రిల్ 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ముఖ్యంగా 6వ తరగతి, ఇంటర్మీడియెట్ ఫస్టియర్ ఎంపీసీలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పేద ఎస్సీ,ఎస్టీ బీసీ,మైనార్టీ బాలికలకు ప్రాధన్యత ఉంటుందన్నారు. వివరాలకు సెల్ 96408201 35 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

5 నుంచి సుంకులా పరమేశ్వరి బ్రహ్మోత్సవాలు

గూడూరు రూరల్: మండలంలోని కె.నాగలాపురం గ్రామంలో కొలువైన శ్రీ సుంకులాపరమేశ్వరీ దేవి బ్రహ్మోత్సవాలను ఏప్రిల్ 5 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి దినేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 5న ప్రభోత్సవం, 6న దివ్య మంగళ రథోత్సవం, 7న లింగమున్న పూజ కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక, నాటక ప్రదర్శన వంటి కార్యక్రమాలను గ్రామ పెద్దలు, ప్రజల సహకారంతో నిర్వహిస్తామని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సుధాకర్ హాజరుకానున్నారని తెలిపారు.

స్పందన సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



కోడుమూరు స్పందనలో వినతులు స్వీకరిస్తున్న అధికారులు

కోడుమూరు రూరల్: స్పందనలో భాగంగా ప్రజలు, రైతుల నుంచి వచ్చే సమస్యల పరిష్కారానికి తక్షణమే ఆయా శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి ఆయా సమస్యలపై వినతులను స్వీకరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజల నుంచి వినతుల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, భూ సమస్యల పరిష్కారానికి కూడా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ రవిప్రకాష్, డిప్యూటీ తహసీల్దార్ రామాంజనేయులు, ఎంఈఓ అనంతయ్య, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

సి.బెళగల్: ప్రజల సమస్యలను మండల, గ్రామ స్థాయి అధికారులు వెంటనే పరిష్కారించాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ సూచించారు. సోమవారం తన కార్యాలయంలో మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు పొలం సమస్యలను, పంట బీమా, ఇళ్ల పట్టాల సమస్యపై అధికారులకు అర్జీలను ఇచ్చారు. స్పందన అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ రాముడుతో కలిసి ఆయన మండల, గ్రామ స్థాయి అధికారులతో పెండింగ్ సమస్యలు, స్పందన అర్జీలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఓ మల్లేష్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సూర్యప్రకాష్, సుమంత్, వైకేపీ ఏపీఎం వెంకటస్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు. ఈఓఆర్డీ సందీప్, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మన్న, పశువైద్యుడు ప్రవీణ్, పీఆర్ ఏఈ గంగరాజుతో పాటు మరి కొందరు అధికారులు గైర్హాజరయ్యారు.

పంచాయతీ గదులకు వేలం



గడివేములలో వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

గడివేముల: స్థానిక పంచాయతీ పరిధిలోని దుకాణాలకు, సంతగేటు, మార్కెట్ గేట్లకు సోమవారం వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాది కంటే ఆదాయం తగ్గిందని ఈఓపీఆర్‌డీ అబ్దుల్‌ఖాలిఖ్, పంచాయతీ కార్యదర్శి తారకేశ్వరీ తెలిపారు. ఐదు దుకాణాలు, సంత, బస్టాండు గేట్లకు గత ఏడాది రూ.5,89,500 లభించగా, ప్రస్తుతం రూ.5,80,550 వేలం పాటలు పాటల్లో దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రాములమ్మ, పంచాయతీ కార్యదర్శి రంగడు పాల్గొన్నారు. అనంతరం పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్యం పదిలం



కర్నూలు(సెంట్రల్): చిరుధాన్యాలతో చేసిన ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కలెక్టర్ పి.కోటేశ్వరరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషన్ పక్వాడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన చిరు ధాన్యాల పోషకాహార వంటకాల ప్రదర్శనను ఆయన తిలకించి మాట్లాడారు. జిల్లాలో చిరుధాన్యాల వాడకాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రజలకు చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఐక్యరాజ్య సమితి 2022-23 ఆర్థిక సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మార్చి 20 నుంచి ఏప్రిల్ 3వ తేదీ వరకు చిరు ధాన్యాల సాగుపై అవగాహన కోసం పోషన్ పక్వాడ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలి

ఎండల తీవ్ర ఎక్కుగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు వచ్చేలా ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ పి.కోటేశ్వరరావు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని హీట్‌వేవ్ ప్రిపరేషన్స్‌పై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా వాతావరణ మార్పులపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో మాట్లాడి చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వడదెబ్బ బారిన పడకుండా చల్లనినీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలన్నారు. పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండడంతో విద్యార్థులు ఎండలకు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని డీఈఓ రంగారెడ్డి, ఏపీసీ వేణుగోపాల్‌ను ఆదేశించారు.